
సాక్షి అనంతపురం

ఆదివారం । 10 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.21 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

12 నుంచి గుల్బర్గా-బెంగళూరు 'వందే భారత్'



గుంతకల్లు: గుల్బర్గా-బెంగళూరు మార్గంలో ఈ నెల 12 నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగించనున్నట్లు స్థానిక రైల్వే డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 12న గుల్బర్గా జంక్షన్ నుంచి రైలు (22231) ఉదయం 5.15 గంటలకు బయలుదేరుతుందన్నారు. వాడి జంక్షన్‌కు 5.40 గంటలకు, రాయచూరుకు 6.53 గంటలకు, మంత్రాలయం 7.08, గుంతకల్లు జంక్షన్‌కు 8.25, అనంతపురం 9.28, ధర్మవరం జంక్షన్ 10.50, యలహంక జంక్షన్‌కు మధ్యాహ్నం 12.45 గంటలకు, బెంగళూరు జంక్షన్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 2.40కు బయలుదేరి యలహంక-3.08 గంటలకు, ధర్మవరం జంక్షన్ సాయంత్రం 5.45, అనంతపురం 5.58, గుంతకల్లు జంక్షన్ 7 గంటలకు, మంత్రాలయం రోడ్డుకు రాత్రి 8.10, రాయచూర్‌కు 8.45, వాడీ జంక్షన్ 11.05, గుల్బర్గాకు రాత్రి 11.30 గంటలకు చేరుతుందన్నారు. గురు, శుక్రవారాల్లో రైలు రాకపోకలు సాగించదని వెల్లడించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు: ట్రాఫిక్ బ్లాక్ కారణంగా గుంతకల్లు డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-సికింద్రాబాద్ (17253), సికింద్రాబాద్-గుంటూరు (17254), గుంటూరు-డోన్ (17228),డోన్-గుంటూరు(17227),కర్నూలు సిటీ-నంద్యాల(07499),నంద్యాల- కర్నూలు సిటీ (07498) రైళ్లను ఈ నెల 19 నుంచి 23 వరకూ రద్దు చేస్తున్నట్లు వివరించారు. హౌరా-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ (22831) రైలును ఈ నెల 20న నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తిఫోర్ట్ మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా (22832) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 22న గుత్తి ఫోర్ట్, ఎర్రగుంట్ల, నంద్యాల మీదుగా దారి మళ్లిస్తామన్నారు. కాచిగూడ-మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 12 నుంచి 19 వరకూ షాద్‌నగర్-మహబూబ్‌నగర్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గజ వాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రి అర్బన్: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బుగ్గ రామలింగేశ్వరుడు గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. శివరాత్రి కావడంతో భక్తులు వేకువ జామునే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ఉపవాస దీక్షలను విరమించారు. భక్తులు, శివమాలధారులతో ఆలయం కిటకిటలాడింది. శివనామస్మరణతో మార్మోగింది. ఉదయాన్నే స్వామి మూల విరాట్‌కు రుద్రాభిషేకం నిర్వహించారు. దక్షిణ దిక్కున ఉన్న కాశీవిశ్వేశ్వరుడికి శివదీక్షాపరులు పంచామృతాభిషేకం చేశారు. సామూహిక హోమం చేపట్టారు.

బాబును నమ్మొద్దు





మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో పార్టీ అసెంబ్లీ, పార్లమెంటు సమన్వయకర్తలు రంగయ్య, శంకర్‌నారాయణ, హాజరైన పార్టీ శ్రేణులు

- మళ్లీ మోసపూరిత వాగ్దానాలు కురిపిస్తున్నారు
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- సొంత పార్టీ నేతలనే వంచించిన ఘనుడాయన
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం
- కళ్యాణదుర్గంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

కళ్యాణదుర్గం: "2014 ఎన్నికల ముందు 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా సరిగా అమలు చేయలేదు. ప్రజలకు మంచి చేసింది లేదు. కానీ, ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మళ్లీ నేడు బూటకపు హామీలు కురిపిస్తున్నారు. అలాంటి వ్యక్తిని నమ్మితే ప్రజలు తమను తాము మోసం చేసుకున్నట్లే" అని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారన్నారు. సొంత పార్టీ నాయకులనే మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు. పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో టీడీపీ అభ్యర్థి బాగా డబ్బున్న వ్యక్తి అని గుర్తు చేశారు. డబ్బును నమ్ముకున్న చంద్రబాబు పెత్తందార్లను బరిలో దించుతుంటే, ప్రజలను నమ్ముకున్న సీఎం వైఎస్ జగన్ ప్రజా నాయకులకే టికెట్లు ఇస్తున్నారన్నారు. టీడీపీ వారు ఇచ్చే డబ్బు తీసుకుని, వైఎస్సార్ సీపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని సూచించారు. ఎంపీ రంగయ్య మాట్లాడుతూ ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందన్నారు. సీఎం జగన్‌పై ప్రజలకు ఉన్న నమ్మకమే తమ పార్టీని గెలిపిస్తుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 96.01 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఇందుకు ఏకంగా రూ.4,147 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపుతామని స్పష్టంచేశారు. అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకర్ నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్, టీవీ5, ఏబీఎన్, ఆంధ్రజ్యోతితో పాటు ఇప్పుడు బీజేపీ నేతలతో గుంపుగా వచ్చినా ఏం చేయలేడన్నారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీడీపీ గెలిస్తే రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం కూడా కొనసాగదని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళ్యాణదుర్గంలో పెత్తందార్లకు, పేదవాడికీ యుద్ధం జరుగుతోందన్నారు. కుప్పంలో కూడా చంద్రబాబును చిత్తు చిత్తుగా ఓడించడానికి మంత్రి పెద్దిరెడ్డి సారథ్యంలో పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, కళ్యాణదుర్గం పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వర్థ నాయక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, రెడ్డి సంక్షేమ సంఘం నేత జగన్ రెడ్డి, కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, బాలరాజు, బసవరాజు, సత్యనారాయణ శాస్త్రి, శివన్న యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జెడ్పీటీసీలు బొమ్మన్న, రాధాస్వామి, నాగరాజు, మంజునాథ్, ప్రభావతమ్మ, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి, వీరశైవ లింగాయత్, వక్ఫ్‌బోర్డు ఫెడరేషన్ల డైరెక్టర్లు పాలాక్షి, ప్రసాద్‌రెడ్డి, షేక్షావలితో పాటు ఐదు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో పార్టీ అసెంబ్లీ, పార్లమెంటు సమన్వయకర్తలు మెట్టు గోవింద రెడ్డి, శంకర్‌నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

రాయదుర్గం: పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు సొంతంగా పోటీ చేసి గెలిచే సత్తా లేదన్నారు. బీజేపీతో పొత్తు కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూసే స్థితికి దిగజారిపోయాడన్నారు. ప్రజా బలం ఉంటే ఇలా చేసే వాడా అని ప్రశ్నించారు. మంచి చేశాడు కాబట్టే సీఎం వైఎస్ జగన్ సింహంలా సింగిల్‌గా ముందుకెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ రెండో సారి ప్రమాణం చేసే వరకూ కార్యకర్తలు సైనికుల్లా ముందుకు సాగాలన్నారు. 175కు 175 అసెంబ్లీ, 25కు 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబుకు సంబంధించి భూతద్దం వేసి వెతికినా ఒక్క సంక్షేమ పథకం లేదంటే పరిపాలన ఎంత అధ్వానంగా సాగించారో అర్థం చేసుకోవాలన్నారు. దివంగత నేత వైఎస్సార్ పేరు చెబితే ఈ నాటికీ ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్య శ్రీ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. ఆయన తనయుడిగా సీఎం వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేసి చరిత్రలో నిలిచిపోయేలా పేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు 32.50 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి, ఇప్పటికే 16 లక్షల ఇళ్లు పూర్తి చేశారని గుర్తు చేశారు. జగన్‌కు, చంద్రబాబుకు మధ్య నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. రాయదుర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి కూడా గతంలో అనేక పదవులు అనుభవించారు తప్ప పేదల సంక్షేమాన్ని విస్మరించాడని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు,మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

'శాశ్వత' ఆనందం

చెప్పాడంటే.. చేస్తాడంతే!

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 200 మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- నియామక పత్రాల అందజేత
- తమ జన్మ ధన్యమైందంటున్న కాంట్రాక్టు ఉద్యోగులు
- రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి వంచించిన చంద్రబాబు

అలవికాని హామీలతో డ్వాక్రా అక్కచెల్లెమ్మలను, రైతన్నలను, పారిశ్రామికవేత్తలను.. ఒకరేమిటి అందరినీ వంచించిన చంద్రబాబు కాంట్రాక్ట్ ఉద్యోగులకూ కుచ్చుటోపీ పెట్టారు. ఆశ చూపి ఓట్లు దండుకున్నారు. అందలమెక్కాక తూచ్ అన్నారు. అధికారంలోకి వచ్చేంత వరకే మీతో పని.. ఆ తర్వాత సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించారు. ఆ క్రమంలోనే పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్ ఆ చిరుద్యోగుల గోడు విన్నారు. భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట నిలుపుకుంటూ వారికి శుభవార్త వినిపించారు. ఎన్నో ఏళ్ల కల తీరిన ఆ చిరుద్యోగుల సంతోషం అంతా ఇంతా కాదు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇస్తే వెనక్కి తగ్గరని మరోసారి నిరూపించుకున్నారు. ఏదైనా మాట చెప్పేముందే ఆలోచిస్తారు.. చెప్పాక చేసేస్తారు, ఇక ఆలోచించరు అని సామాన్యుల నుంచి ఉద్యోగుల వరకూ కొనియాడుతున్నారు. ఇచ్చిన మాట మేరకు తాజాగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించారు. పలువురికి నియామక పత్రాలు అందజేశారు. మిగిలిన వారందరికీ సోమవారంలోపు నియామక పత్రాలు అందించనున్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణంలో శనివారం మెడికల్ అసోసియేషన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మెడికల్ అసోసియేషన్ నాయకులు

రెండు వందల మందికి పైగా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సుమారు 200 మందికి పైగా శాశ్వత ఉద్యోగులుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. వీరిలో ఫార్మసిస్టులు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు రెగ్యులరైజ్ అవుతున్నారు. ప్రస్తుతం వీరికి రూ.32,740 వేతనం వస్తోంది. ఇకపై రూ.45 వేలకు పైగా అందనుంది. వీరంతా 2002, 2003 సంవత్సరాల్లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపికయ్యారు. మరో పదేళ్లకు పైగా సర్వీసు ఉంది. రిటైర్ అయ్యేనాటికి రూ.1.02 లక్షల వేతనం వచ్చే అవకాశమున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

బతిమాలుకున్నా బాబు కనికరించలేదు

2014 ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దశలవారీగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక గాలికొదిలారు. అప్పట్లో కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నో సార్లు బాబును కలిసినా స్పందించలేదు. సుప్రీం కోర్టులో పలు రాష్ట్రాలకు సంబంధించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, రెగ్యులరైజ్ చేయడం కుదరదని అప్పటి ఆర్థిక మంత్రి యనమల చెప్పారు. దీంతో ఉద్యోగులు ఆశలు వదులుకున్నారు. ఈ ప్రభుత్వంలో వారి ఆశలు ఫలించాయి.

చరిత్రాత్మక నిర్ణయం

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జీఓ విడుదల చేయడం చరిత్రాత్మకం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం జీవితాంతం గుర్తుండిపోయే బహుమతి అందించింది.

– శ్రీధర్‌బాబు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఇంతకన్నా ఏం కావాలి..

టీడీపీ హయాంలో అనేక సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. నోటిఫికేషన్ ద్వారా ఎంపిక చేసినా తీవ్ర జాప్యం చేశారు. ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. ఇంతకన్నా ఏం కావాలి.

– శివకుమార్, ఎంపీహెచ్‌ఏ, బెళుగుప్ప

మేలు మర్చిపోం

21 ఏళ్లు తాము చేసిన శ్రమను ముఖ్యమంత్రి జగన్ గుర్తించారు. ఆయనకు ఉద్యోగుల తరఫున పాదాభివందనం చేస్తున్నా. ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు వెళ్లారు. కానీ మా జీవితాల గురించి ఆలోచించిన ముఖ్యమంత్రి ఈయనే. సీఎం జగన్ చేసిన మేలు మర్చిపోలేం. మాజన్మ ధన్యమైందని భావిస్తున్నాం.

– రాఘవేంద్రకుమార్, ఎంపీహెచ్‌ఏ, కురుగుంట పీహెచ్‌సీ

హామీ ఇస్తే తగ్గరని నిరూపించారు

గతంలో వైఎస్ జగన్ అనంతపురానికి పాదయాత్రగా వచ్చినప్పుడు కలిశాం. మా గోడు వెళ్లబోసుకున్నాం. న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పుడు నెరవేర్చారు. ఐదుగురు సీఎంల వల్ల కానిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసి చూపించారు. రాజశేఖర రెడ్డి కొడుకుగా ఆయన్ను గుండెల్లో పెట్టుకుంటాం.

– జాన్సన్, ఎంపీహెచ్‌ఏ, బ్రహ్మసముద్రం పీహెచ్‌సీ

'ఆర్మీ' నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 లోపు www.joinindianarmy.nic.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3 దశల్లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉంటుందన్నారు. విద్యార్హత, శారీరక/వైద్య ప్రమాణాల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. యానిమేటెడ్ వీడియోల రిజిస్టర్, దరఖాస్తు, పరీక్షకు ఎలా హాజరు కావాలి అనే వివరాలు కూడా పొందుపరిచారన్నారు. సందేహాలుంటే 08554-241146 నంబరుకు సంప్రదించాలన్నారు. అడ్మిట్ కార్డ్ కలర్ ప్రింట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని సూచించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రత

అనంతపురం: ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాడికి మండల కేంద్రంలో శనివారం కవాతు నిర్వహించామన్నారు. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే ధ్యేయమన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఓ గుంతలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి(50) అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ నాగమాణిక్యం పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఛాతీ వద్ద స్వల్పగాయాలున్నాయి. మృతదేహం ఉన్న స్థలంలో ఎక్కువగా అసాంఘిక కార్యాకాలపాలు జరుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

అనంతపురం: ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 60 రోజుల పాటు నిరుద్యోగ యువతీ, యువకులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు సంస్థ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20 నుంచి 35 ఏళ్లలోపు వయసుండి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత నుంచి పీజీ వరకు పాస్, ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి అభ్యర్థికి శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం ఉచితమని, వివరాలకు 7396950345, 07780752418 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన వీఆర్ఏ రంగనాయకులు, రాజా, రవి

యాడికి: కోనుప్పలపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మండల కేంద్రానికి చెందిన వీఆర్ఏ రంగనాయకులు, రాజా శనివారం ఉదయం కోనక్షేత్రంలోని రామలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. కోనుప్పలపాడు క్రాస్ వద్ద అదే గ్రామానికి చెందిన రవి ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొన్నాడు. ఘటనలో ముగ్గురికీ తీవ్రగాయాల్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

కళాశాల నుంచి కార్ఖానాకు..

- కోర్సు కాలంలోనే పరిశ్రమ అనుభవం
- పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా తర్ఫీదు
- లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులకు స్టైఫండ్
- అదే కంపెనీలో ఉద్యోగాలు దక్కేలా చొరవ
- దేశ చరిత్రలోనే తొలిసారి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు
- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు సువర్ణావకాశం
- ఇది వరకు ఫ్యూచర్స్ స్కిల్స్ పేరిట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంజినీరింగ్ విద్యార్థుల సాంకేతిక పాఠాలు


జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: ఒకపుడు ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసినా, ఉద్యోగ అవకాశాలు దక్కాలంటే కంపెనీల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. ఏడాది, రెండేళ్ల పాటు బయట కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోవాలి. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అయినప్పటికీ కొలువు దక్కుతుందని నమ్మకం లేదు. ఇదంతా గతం. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇంజినీరింగ్ కోర్సు పూర్తి కాక ముందే రాష్ట్ర ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. గతంలో ఇంటర్న్‌షిప్ అంటే తెలియని పరిస్థితి. కంపెనీల చుట్టూ విద్యార్థులు తిరిగితే ఉద్యోగాలు దక్కే పరిస్థితి నుంచి విద్యార్థుల చుట్టూ కంపెనీలే తిరిగే పరిస్థితికి వచ్చింది. ఇందుకు కారణం . పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొదించడం. విద్యార్థుల కోర్సుకు సంబంధించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం, వసతి కల్పించడం, కోర్సులో నాణ్యమైన నైపుణ్యాలు పెంపొందించడం, 10 నెలల కంపెనీ ఇంటర్న్‌షిప్ కల్పించడం ప్రతి అంశంలోనూ విద్యార్థికి చేదోడువాదోడుగా ఉండడంతో కోర్సు పూర్తి కాగానే ఉద్యోగాలు దక్కుతున్నాయి. కళాశాల నుంచి నేరుగా పరిశ్రమకు వెళ్తున్నారు.

దీర్ఘకాల ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక

ఇంజినీరింగ్ విద్యార్థులకు దీర్ఘకాల ఇంటర్న్‌షిప్(లాంగ్ టర్మ్) కు ఎంపిక పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం 30 కి పైగా ప్రపంచ స్థాయి సంస్థల్లో వర్చువల్‌గా, మరో 30 వేలకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల ద్వారా ఇంటర్న్‌షిప్ కల్పిస్తోంది. ఇంటర్న్‌షిప్ కోసం ఉన్నత విద్యా మండలి పోర్టల్‌లో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎంఎల్ఎంఎస్) ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా గుర్తించిన సంస్థల వివరాలను అప్‌డేట్ చేస్తున్నారు. ఆ సంస్థలతో సమన్వయం చేసేందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీలను ప్రభుత్వం నియమించింది.

ప్రపంచ స్థాయి సంస్థలతో ఒప్పందం

విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ప్రముఖ వర్తక, వాణిజ్య సంస్థలతో సహా కోర్సులతో సంబంధం ఉన్న మైక్రో, స్మాల్, మీడియం, లార్జ్, మెగా సంస్థలను ప్రభుత్వం ఎంపిక చేసింది. వీటిలో మ్యానుఫ్యాక్చరింగ్‌తో పాటు సర్వీసు సంస్థలూ ఉన్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. ఎల్ఎంఎస్–ఐఐసీ పోర్టల్‌లో వాటి వివరాలను అందుబాటులోకి తెచ్చింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, స్మార్ట్ ఇంటర్న్జ్, ఎక్సల్ ఆర్, సెలర్ అకాడమీ, సిస్కో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, వాద్వాని ఫౌండేషన్, టీమ్ లీజ్ వంటి సంస్థల ద్వారా ఇంటర్న్‌షిప్ అందిస్తోంది.

జేఎన్‌టీయూ పరిధిలో 912 మందికి అవకాశం

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో మొత్తం 912 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నారు. బీటెక్ సెకండియర్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు రెండు నెలలు, బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు రెండు నెలలు, బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో స్టైఫండ్ రూ.5 వేల నుంచి రూ.25 వేలు చెల్లిస్తున్నారు. ప్రతిభ చాటితే అదే కంపెనీల్లోనే కొలువులు కల్పిస్తున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కే. నాగహిమజకు నెలకు రూ.1.10 లక్షల స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌ను అమెజాన్ కంపెనీ కల్పించింది.

- ఇప్పటికే 2,024 పాఠశాలలకు రూ.1,014 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పాఠాలు చెప్పేందుకు వీలుగా ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.12 వేల స్టైఫండ్‌ను అందిస్తోంది. ఈ ప్రోగ్రాం ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్‌గా పిలుస్తున్నారు.
- తాజాగా లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌ను ఆయా కంపెనీలు విద్యార్థులకు స్టైఫండ్ ఇస్తున్నాయి. అనంతరం అదే కంపెనీలో కొలువులు కల్పిస్తున్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల వివరాలు

కళాశాల	ఎంపికైన విద్యార్థుల సంఖ్య
జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల	50
కలికిరి ఇంజినీరింగ్ కళాశాల	02
మదర్ థెరీసా కళాశాల	17
ఎస్ఆర్ఐటీ (అనంతపురం)	40
విశ్వం	58
అశోక ఉమెన్ ఇంజినీరింగ్ కళాశాల	02
రాజీవ్‌గాంధీ మెమోరియల్ కళాశాల	78
ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి	253
పుల్లా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు	143
మదనపల్లి ఇంజినీరింగ్ కళాశాల	172
పీబీఆర్వీఐటీ , కావలి	31
ఎస్వీసెట్, చిత్తూరు	81
మొత్తం	919

కోర్సు పూర్తి కాగానే కొలువు



కోర్సు పూర్తికాగానే కొలువు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విద్యా ప్రణాళికను అమలు చేస్తోంది. ఇది వరకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ ప్రోగ్రాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పాఠాలు చెప్పేందుకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాం. ఇందుకు గాను ప్రతి నెలా రూ.12 వేలు స్టైఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. తాజాగా లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు సంబంధించి మొత్తం 919 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన విప్లవాత్మకమైన మార్పులతోనే ఇలాంటి సంస్కరణలు సాధ్యమవుతున్నాయి.

– ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇది వరకు ఇలాంటి కార్యక్రమాలు ఎన్నడూ చూడలేదు. ఇంటర్న్‌షిప్‌లోనే ఏకంగా రూ.20 వేలు స్టైఫండ్ ఇస్తున్నారు. బహుళజాతి సంస్థల్లోనే ఇంకా పెద్ద మొత్తంలో స్టైఫండ్ కల్పిస్తున్నారు. మొత్తం 10 నెలల పాటు అదే కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తే కంపెనీ పరిస్థితులకు అలవాటు పడి ఉద్యోగంలోనే నిలదొక్కుకోవడానికి మంచి బృహత్తర పథకం ఇది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఇప్పటి దాకా 919 మంది విద్యార్థులకు మంచి బహుళజాతి సంస్థల్లోనే ఇంటర్న్‌షిప్ కల్పించాం.

– ప్రొఫెసర్ సి. శశిధర్, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ అనంతపురం.

బడుగుల సంక్షేమానికి పెద్దపీట


గుర్తింపు కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: బడుగుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో వాయిద్య కళాకారులకు ఎమ్మెల్యే ప్రభుత్వ గుర్తింపుకార్డులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాయిద్య కళాకారులకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 578 గుర్తింపు కార్డులు మంజూరు చేసిందని, అందులో అర్బన్‌లో 110 మందికి కార్డులు ఇస్తున్నామన్నారు. అర్బన్‌లో 400 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.32.67 లక్షల ఉచిత కరెంటు కింద సబ్సిడీ అందిస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కళాకారులుగా గుర్తింపు కార్డుల కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులను మంజూరు చేశారన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బంకు శీన, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రచార కార్యదర్శి రామకృష్ణ, వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా యువజన కార్యదర్శి మంజు, నగరాధ్యక్షుడు పెనుగచెర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అనంత రైజింగ్ స్టార్, తాడిపత్రి ఎలెవన్ జట్ల గెలుపు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో శనివారం జరిగిన సీనియర్ ఏపీఎల్ టీ–20లో అనంత రైజింగ్ స్టార్, తాడిపత్రి ఎలెవన్ జట్లు గెలుపొందాయి. అనంత రైజింగ్ స్టార్ , హిందూపురం యునైటెడ్ క్లబ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంత రైజింగ్ స్టార్ 19.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం హిందూపురం యునైటెడ్ క్రికెట్ క్లబ్ 11.2 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. ఇక మరోమ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తపోవనం క్రికెట్ క్లబ్ నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులు చేసింది. సంజయ్ నాయుడు 55 బంతుల్లో 83 పరుగులు (ఆరు ఫోర్లు, 7 సిక్సర్లు)చేసి రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి –ఎలెవన్ జట్టు 15 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి విజయం సాధించింది.

జపనీస్ భాషపై శిక్షణ

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీష్ భాష ఎన్5, ఎన్4తో పాటు ఎన్3 స్థాయిల్లో శిక్షణతోపాటు ఉపాధి కల్పించనున్నారు. ఈమేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 32 ఏళ్లలోపు ఉన్న, జపాన్ దేశంలో పనిచేయడానికి ఆసక్తి గల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు బెంగళూర్‌లో శిక్షణ ఇస్తారని, శిక్షణ ఫీజు రూ.3 లక్షలు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు కాగా, ఇందులో రూ.25 వేలు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. తక్కిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షలను మూడు విడతల వారీగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి జపాన్‌లో ఉద్యోగ అవకాశాం కల్పించడానికి కావాల్సిన సదుపాయాలు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. శిక్షణ పూర్తియిన వెంటనే రూ.1,10,000 నుంచి 1,40,000 వరకు వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9885943819 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డీబార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన మొదటి సంవత్సరం గణితం –1బీ, జువాలజీ–1, హిస్టరీ–1 పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. నగరంలోని వికాస్ జూనియర్ కళాశాల కేంద్రంలో కాపీలు కొడుతూ ఇద్దరు విద్యార్థులు దొరికిపోవడంతో అధికారులు వారిని డీబార్ చేశారు. జనరల్ విద్యార్థులు 19,642 మందికి గాను 19,097 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,188 మందికి గాను 2,072 మంది హాజరయ్యారు. 1116 మంది గైర్హాజరయ్యారు.

అమ్మ డెయిరీ మహిళా రైతులకు అంకితం

- నేడు డెయిరీ ప్రారంభం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులు రూ. 20 కోట్లతో ఆలమూరు వద్ద డెయిరీ ఏర్పాటు
- రాష్ట్రంలోనే తొలి మహిళా సహకార డెయిరీ
- మంత్రులు రోజా, ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా మహిళా పాడి రైతులకు గిఫ్ట్‌డీడ్ల అందజేత


అమ్మ డెయిరీ

రాప్తాడురూరల్: పాలకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్థికాభివృద్ధి వైపు నడిపించాలనే ఉద్దేశంతో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన అమ్మ డెయిరీని ఆదివారం మహిళా రైతులకు అంకితం చేయనున్నారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఐదెకరాల స్థలంలో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.20 కోట్లతో 'అమ్మ' (అనంతపురం మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్) డెయిరీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా సహకార డెయిరీ ఇదే కావడం విశేషం. మంత్రులు ఆర్కే రోజా, ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్లను నేడు పాడి రైతులకు అందజేయనున్నారు. డెయిరీ నిర్వహణ బాధ్యతలు కూడా వారికే అప్పగించనున్నారు. దాదాపు 20 వేలమంది మహిళా పాడి రైతులకు నికర ఆదాయం కల్పించాలనే సంకల్పంతో ఈ 'అమ్మ డెయిరీ' ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

ములకనూరు డెయిరీ ఆదర్శం

తెలంగాణ రాష్ట్రం వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరులోని 'ములకనూరు మహిళా సహకార డెయిరీ' దేశంలోనే మొదటి మహిళా డెయిరీ. ఈ డెయిరీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. మహిళా రైతులు 'ములకనూరు మహిళా సహకార డెయిరీ'లో భాగస్వాములై చేయిచేయి కలిపి ఆర్థిక ప్రగతి సాధించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పలుమార్లు ఈ డెయిరీని సందర్శించారు. అక్కడి మహిళా రైతుల విజయగాథను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. దీన్ని ఆదర్శంగా తీసుకునే 'అమ్మ' డెయిరీ ఏర్పాటుకు పూనుకున్నారు.

ఇవీ 'అమ్మ డెయిరీ' ప్రత్యేకతలు

ఈ డెయిరీ పూర్తిగా మహిళల సారథ్యంలో నిర్వహిస్తారు. రోజూ 1.20 లక్షల లీటర్ల పాలను సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. డెయిరీ ద్వారా పాలతో పాటు పెరుగు, లస్సీ, బాదంపాలు, నెయ్యి, కోవా, పన్నీరు లాంటి పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించనున్నారు. ప్రతి గ్రామంలో ఎన్‌డీడీబీ వారు ఆమోదించిన అధునాతన యంత్రాలతో పాలనాణ్యతను పరీక్ష చేసి సేకరిస్తారు. అధునాతన యంత్రాలు ఏర్పాటు చేయడంతో సరసమైన ధరలో వినియోగదారులకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించనున్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మహిళా పాడి రైతులకు బిల్లులు చెల్లిస్తారు. ప్రైవేట్ డెయిరీల దోపిడీ నుంచి పాడి మహిళా రైతులను రక్షిస్తూ ఆశించిన ధర కల్పించి వారి ఆదాయాన్ని పెంచడమే 'అమ్మ' డెయిరీ లక్ష్యం. కో–ఆపరేటివ్ విధానంలో డెయిరీ నిర్వహణకు సంబంధించిన ఖర్చులు పోనూ మిగిలిన ఆదాయాన్ని బోనస్ రూపంలో మహిళా రైతులకు అందిస్తారు.

మహిళా రైతులే యజమానులు



సహకార వ్యవస్థను పునర్నిర్మాణం చేసే ప్రయత్నంలో భాగంగా 'తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో 'అమ్మ' డెయిరీని నిర్మించాం. పాడి మహిళా రైతులతో ఫెడరేషన్ ఏర్పాటు చేశాం. ఇది పూర్తిగా మహిళా రైతులదే. డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులు. ఆదాయం వారికే. ఇప్పటికే రిజిస్ట్రేషన్ కూడా చేసేశాం. గిఫ్ట్‌డీడ్ డాక్యుమెంట్లను ఆదివారం అందజేసి అమ్మ డెయిరీని అక్క చెల్లెమ్మలకు అంకితం చేయనున్నాం.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

దస్తగిరి చెప్పేదాంట్లో నిజం లేదు

- రోడ్డు ప్రమాద బాధితుడు చిన్న కదిరప్ప


చికిత్స పొందుతున్న చిన్న కదిరప్ప

కదిరి: పులివెందుల–కదిరి మార్గమధ్యంలో ఉన్న నామాలగుండు వద్ద శనివారం జరిగిన బైక్ ప్రమాదంలో తలుపుల మండలం పులిగుండ్లపల్లికి చెందిన కూలి పని చేసుకునే దళిత చిన్న కదిరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అతను ప్రస్తుతం కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. అయితే రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నకదిరప్ప తన తండ్రి షేక్ హాజీవలీని చంపడానికి వచ్చాడంటూ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి కట్టుకథ అల్లాడు. దీన్ని ఎల్లో మీడియా అందిపుచ్చుకుంది. నిజానిజాలు తెలుసుకోకుండానే దస్తగిరి చెప్పిందే వేదం అన్నట్లుగా తెగ ప్రసారం చేసింది. వాస్తవమేంటో బాధితుడు చిన్న కదిరప్ప మాటల్లోనే..



'నాకు ఏడుగురు కూతుర్లు. పెద్దకూతురు నాగేశ్వరిని పులివెందులలోని బాకరాపేటకు చెందిన ప్రసాద్‌కు ఇచ్చి పెళ్లి చేశాను. శుక్రవారం (8వ తేదీన) కూతురింటికి పోయి శనివారం మళ్లీ కదిరికి బయలుదేరాను. బస్సు కోసం పులివెందులలో రోడ్డు పక్కన నిలబడుకోంటే..మాకు బంధువైన తలుపుల మండలం శిద్దుగూరిపల్లికి చెందిన మల్లికార్జున బైక్ మీద వెళ్తూ నన్ను చూసి ఆపి బండిలో ఎక్కించుకున్నాడు. చార్జీ డబ్బులు మిగిలిపాయ.. అనుకొని ఎక్కాను. బండి స్పీడ్‌గా పోతూ నామాలగుండు దగ్గరకు రాగానే బ్రిడ్జి దగ్గర పొరపాటున ఫుట్‌పాత్‌కు తగిలింది. నేను కిందపడిపోయినా. అదే సమయంలో ఎదురుగా ఒకాయన వస్తుంటే ఆయనకు కూడా పొరపాటున బండి తగిలి కన్ను దగ్గర చిన్న గాయమైంది. ఆయన ఎవరో కూడా మాకు తెలీదు. కావాలనే బండి తగిలించారంటూ ఆయన నన్ను కొట్టడానికి వచ్చాడు. అక్కడ పడిపోయిన నా సెల్‌ఫోన్ తీసుకుంటుంటే దాన్ని కూడా లాక్కున్నాడు. నాకు తల నుంచి రక్తం కారిపోతుంటే అక్కడున్న స్థానికులు చూసి ఆయన దగ్గర నుంచి నా సెల్ ఇప్పించారు. అక్కడున్న వారిలో ఎవరో 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌ను పిలిపించి నన్ను తలుపుల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కదిరి ప్రభుత్వాసుపత్రికి తెచ్చారు' అని చిన్న కదిరప్ప వివరించాడు. 'మీరే ఆయన్ను చంపాలని ప్రయత్నించారంట..నిజమేనా?' అని కదిరప్పను పాత్రికేయులు ఆసుపత్రిలో ప్రశ్నించగా.. 'నాకు దెబ్బలు తగిలి ప్రాణం పోతుంటే వాడెవడో ఎందుకు అట్ల జెప్పినాడు?! దీంట్లో ఏందో రాజకీయం ఉంది. మేము కూలీనాలీ చేసుకునేటోళ్లం. మాకెందుకు నాయనా అట్లాంటివి' అని అన్నాడు. బైక్ ప్రమాదంలో గాయపడిన కదిరప్ప ఫిర్యాదు మేరకు పులివెందుల సీఐ శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

టీడీపీలో మొదలైన లొల్లి

- అమిలినేని ముందే బ్రహ్మసముద్రం నేతల వాగ్వాదం

కళ్యాణదుర్గం: తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య లొల్లి మొదలైంది. టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఒక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ మరో వర్గం నేతలు మండిపడుతున్నారు. ఒకే మండలానికి చెందిన ఇద్దరు నేతలు అభ్యర్థి ఎదురుగా వాగ్వాదానికి దిగడానికి ప్రస్తుతం శెట్టూరు రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయం వేదికైంది. శనివారం ఐదు మండలాల శ్రేణులతో సమావేశం జరిగింది. ఉదయం అంతా ఒకే తాటిపైకి రావడం చాలా సంతోషమని సంబరపడ్డారు. అయితే అక్కడే అసలు సమస్య మొదలైంది. బ్రహ్మసముద్రం మండల కన్వీనర్‌గా ఉన్న పాలబండ్ల శ్రీరాములు, బొమ్మగానిపల్లి మాజీ సర్పంచు తిమ్మప్పచౌదరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. టీడీపీ అధిష్టానం అమిలినేనిని అభ్యర్థిగా ప్రకటించగానే తిమ్మప్ప చౌదరి ఆయన పంచన వచ్చి చేరారు. మండల కన్వీనర్ శ్రీరాములు కాస్త దూరంగా ఉన్నారు. ఈ రోజు ఇద్దరూ ఒకే వేదికపైకి వచ్చాక పార్టీ కోసం తానంటే తాను కష్టపడ్డానని, కేసులు పెట్టించుకున్నామని ఒకరిపై ఒకరు స్టేజీ మీదే వాగ్వాదం చేసుకున్నారు. కేవలం ఒకే వర్గానికి వత్తాసు పలికితే సహించేది లేదంటూ చిందులు వేసుకున్నారు. ఇదంతా అక్కడే ఉండి గమనించిన అమిలినేనికి ఏం చేయాలో పాలు పోలేదు. అసలే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గం, టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఉమా మహేశ్వర నాయుడుల వర్గాల్లో ఏ వర్గానికి ప్రాధాన్యత ఇచ్చినా తనకే ముప్పు అని తెలుసుకుని ఎవరికి మద్దతు చెప్పకుండా లోలోన మదనపడుతున్నట్లు సమాచారం.

నేత్రపర్వం.. జరుట్ల రామలింగేశ్వరస్వామి రథోత్సవం



పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి, జరుట్ల రామలింగేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

వజ్రకరూరు: జరుట్లరాంపురంలో శనివారం రామలింగేశ్వరస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం స్వామి మడుగు తేరు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి రథంపై ఉంచారు. అనంతరం రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి హరహర మహాదేవా శంభో శంకర అంటూ వేలాదిమంది భక్తుల నడుమ రథాన్ని ముందుకు లాగారు. భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. యువకుల వివిధ వేషధారణలతో అలరించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అంగదాలకృష్ణయ్య, సర్పంచు తిరుపాల్‌యాదవ్, అర్చకులు మంజునాథస్వామి తెలిపారు.

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి



నసనకోటలో ప్రచారం చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుదామని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం రామగిరి, నసనకోట, మాదాపురం గ్రామాల్లో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసే నాగార్జున తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందినట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ, జనసేన ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచ్ మీనుగ నాగరాజు, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ జనార్దన్, బండారు అనిల్‌కుమార్, రామలింగారెడ్డి, రామాంజినమ్మ, వెంకటేష్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

వినయ్ కుమార్‌కు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధన చేసిన టంగుటూరి వినయ్ కుమార్‌కు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ రమణ పర్యవేక్షణలో 'భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు- వాటి ప్రభావం-అధ్యయనం' అనే అంశంపై వినయ్ కుమార్ పరిశోధన చేశారు. గత పది సంవత్సరాల్లో భారతదేశానికి అగ్రగామి దేశాల జాబితాలో ఉన్న మొదటి పది దేశాల విదేశీ పెట్టుబడులు వాటి ప్రభావంపై లోతైన అధ్యయనం చేపట్టారు. వీటితో పాటు ప్రపంచ, వివిధ వాణిజ్య బ్లాకులలో ఉన్న పెట్టుబడుల స్థాయిని కూడా సవివరంగా వివరించారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి

ఆత్మకూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించింది. ఇంటింటికీ వెళ్లి జగనన్న అందజేసిన సంక్షేమ పథకాలను తెలియజేద్దాం. వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరం సైనికుల్లా పని చేద్దామని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరులో బీఎస్ఏలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్, కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, అతిక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, అంజినప్ప, నరసింహ, రామునాయక్, మురళి, ఓబీ టైలర్ వెంకటేష్, దేవేంద్ర పాల్గొన్నారు.

ముస్లింలపై పోలీసుల దాడి దుర్మార్గం



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం మైనారిటీ ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: ఢిల్లీలో నమాజ్ చేస్తున్న ముస్లింలను బూటు కాలుతో తన్నిన పోలీసులను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించాలని ముస్లిం మైనారిటీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముస్లింలపై పోలీసుల దాడిని ఖండిస్తూ ఆవాజ్, ముస్లిం మైనారిటీ ప్రజా సంఘాల నాయకులు శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్, సంఘాల నాయకులు మసూద్, ఇర్ఫాన్, తదితరులు మాట్లాడారు. న్యూ ఢిల్లీలోని ఇంద్రలోక్ ప్రాంతంలో నమాజ్ చేస్తున్న ముస్లింలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పోలీసులు దాడి చేసి బూటు కాలితో తన్నడం అత్యంత దుర్మార్గమన్నారు. అనైతిక చర్యలకు పాల్పడిన పోలీసులను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ఇలాంటి చర్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్‌బాబు, ఇస్మాయిల్, ఇమామ్, బాషా, ఎస్‌కేఆజం, షౌకత్ ఖాన్, నూర్‌బాబా, ఫిరోజు, జహంగీర్, ఎంఐఎం బాషా తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు





ఆత్మకూరు: అలంకరణలో మంజునాథుడు, రామగిరి: పూజలందుకున్న భోగేశ్వరుడు, అనంతపురం సెంట్రల్: పుష్పాలంకరణలో మహాశివుడు

రామగిరి: మండలంలోని పేరూరు, నసనకోట, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి, మాదాపురం, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి పండుగను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం రాత్రి జాగరణ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక భజనలు చేశారు. భక్తులకు అల్పాహారంగా ప్రసాదం, పానకాలను దేవాలయ సిబ్బంది అందజేశారు. పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకున్నారు. గ్రామాల్లో శివనామస్మరణ మార్మోగింది.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మరథోత్సవం

అనంతపురం సెంట్రల్: శివరాత్రి జాగరణ మహోత్సవం ముగింపు వేడుకలు శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఘనంగా జరిగాయి. నాల్గవ రోడ్డులోని రామలింగేశ్వర ఆలయంలో మహాశివుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో బ్రహ్మ రథోత్సవం కనుల పండువగా జరిగింది. పార్వతీ పరమేశ్వరులు పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం దీక్ష హోమం, శాంతి హోమం, దసహారతులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా సాగిన సాంస్కృతిక వేడుకల్లో కళాకారులు శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మంజునాథుడికి రుద్రాభిషేకం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. శనివారం మంజునాథ స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు, రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రంజాన్ సంతోషంగా జరుపుకోండి



ఎమ్మెల్యే అనంతకు వినతిపత్రం అందజేస్తున్న ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం

- ఉపవాస దీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రంజాన్ పండుగను ముస్లిం మైనార్టీ సోదరులు సంతోషంగా జరపుకోవాలి. రంజాన్ పండుక కంటే ముందు మైనార్టీలు భక్తిశ్రద్ధలతో ఆచరించే ఉపవాస దీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రంజాన్ మాసంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. గత కొన్నేళ్లుగా రంజాన్ పండుగకు సంబంధించి ఉపవాస దీక్షలు, తదితర పండుగ కార్యక్రమాలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకునేవారమని, ఈ నెల నుంచి ఏప్రిల్ 11 వరకు రంజాన్ ఉపవాస దీక్షల కార్యక్రమాలకు సహకరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మసీదుల వద్ద నిరంతర విద్యుత్, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రత్యేక చొరవ తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. అలాగే ఈద్గా మైదానాలు, శ్మశాన వాటికల సుందరీకరణకు చర్యలు చేపడుతామన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఆల్ మేవా) నూతన సంవత్సర డైరీని మేయర్ వసీం శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీ సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల అభ్యున్నతికి వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూక్, మక్బూల్, ఫక్రుద్దీన్, దౌలా, మహబూబ్‌బాషా, జిలాన్, అన్వర్, అబ్దుల్ రసూల్, చాంద్‌బాషా, అశ్రఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి దేవుడ్ని కోరుకున్నారు. శివరాత్రి పండుగ ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని బి.యాలేరు శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గ్రామంలో రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్ప వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో కుర్లపల్లి గ్రామానికి చెందిన తలారి అక్కమ్మ వృషభాలు, అలాగే తోపుదుర్తి చెన్నప్ప వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. బుక్కచెర్లకు చెందిన పవన్‌కుమార్ వృషభాలు నాలుగో స్థానం దక్కించుకున్నాయి. ఐదో స్థానంలో బి.యాలేరుకు చెందిన నాగరాజు వృషభాలు నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేల చొప్పున అందించారు. విజేతలకు బహుమతుల నగదును తోపుదుర్తి బ్రదర్స్ ప్రకటించగా.. గ్రామస్తులు ఆధ్వర్యంలో నగదును విజేతలకు అందజేశారు.

సంస్కృతీ సంప్రదాయాలు గౌరవించాలి



శ్రీకృష్ణ ఉయ్యాల పేరంటంలో పాల్గొన్న నృత్యకళాకారుల బృందం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని దాస సాహితి ప్రాజెక్టు నిర్వాహకులు విజయమ్మ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో మూడవ రోడ్డులో విఠోబా దేవస్థానంలో శ్రీకృష్ణ ఉయ్యాల పేరంటం జరుపుకున్నారు. మాఘమాసంలో అశ్వత్థం చెట్టుకు జాకెట్లు ఉయ్యాలగా కట్టి దానిలో శ్రీకృష్ణుడి విగ్రహం పెట్టి పూలమాలలో అలకరించి, కోలాటం ఆడించి, పెరుగు అటుకకులు, తీపి అటుకులు నైవేద్యం పెట్టడం మన ఆచారాల్లో ఒక భాగమని వివరించారు. మనం ఆచరిస్తూ తర్వాత తరానికి మనం అందజేసిన వారం అవుతామని సూచించారు. శ్రీకృష్ణుడు ఉయ్యాల పేరంటం ఆచరించడం ద్వారా వంశాభివృద్ధి చెందుతుందని వివరించారు అనంతరం ఓం సగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ దేవరకొండ కౌసల్య బృందంచే కోలాటం, నృత్యం అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం అరుణ, ముఖ్య అతిథుగుల పంచరత్నం సుబ్బలక్ష్మి, సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ దేవరకొండ కౌసల్య బృందం, చంద్రకళ, శిరీష, రాగిణి, సమృద్ధి, పద్మ, శారద సమాజం సభ్యులు పాల్గొన్నారు.

నేడు బుగ్గ రామలింగేశ్వరుడి కల్యాణం, రథోత్సవం

తాడిపత్రి అర్బన్: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బుగ్గ రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోని వేదికపై పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరగనుంది. వేసవి దృష్ట్యా భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిళ్లు వేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు బుగ్గరామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే రథాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

11న రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాళ్: గోవిందవాడలో ఎణ్ణేరంగనాథేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా 11న ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ తెలిపారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ. 20 వేలు, నాల్గో బహుమతి రూ.15 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణోత్సవం



కూడేరు: శివపార్వతులకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా పేరుగాంచిన కూడేరు జోడు లింగాల సంగమేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి పల్లకీలో మంగళవాయిద్యాల నడుమ జోడు లింగాల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల నడుమ శివపార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. భక్తుల నడుమ తోపులాట చోటు చేసుకోకుండా సీఐ శివరాముడు ఆధ్వర్యంలో భద్రత కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ బాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. కోన రామలింగేశ్వరుడి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

యాడికి: కోన క్షేత్రంలో రామలింగేశ్వరుడి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. తిరునాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో వేకువజామున శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, కోనా బ్రదర్స్ జగదీశ్వరరెడ్డి, వెంకటశివారెడ్డి, దేవనాథరెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు రామలింగేశ్వరుడు, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేత బాలగంగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్క భజన ఆకట్టుకుంది. వైఎస్సా ర్‌సీపీ నాయకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీరామ్ కుమార్, పరమేశ్వర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నేడు 46వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 46వ డివిజన్‌లో ఆదివారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని 5వ రోడ్డు సాయిబాబా దేవాలయం నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ బడుల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నరసింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్ల నిండి 6 ఏళ్లలోపు వయస్సు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కనగానపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో (కేజీబీవీ) ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ అరుణమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీట్ల భర్తీలో అనాథ పిల్లలు, డ్రాపౌట్ విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

మాలలకు ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మాలలకు అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు జేఏసీ అధ్యక్షుడు గంగాధర్ కోరారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో మాల మహానాడు ఐక్యవేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాలలు అత్యధికంగా ఉన్నారన్నారు. అయితే రాజకీయంగా మాలలు వెనుకబడిపోయారని తెలిపారు. రాజకీయ పార్టీలు మాలలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

నేడు మ్యూజియం ప్రారంభోత్సవం

అనంతపురం సెంట్రల్: దాదాపు రూ.7 కోట్లకు పైగా నిధులు వెచ్చించి అధునాతన సాంకేతిక నైపుణ్యంతో సుందరంగా నిర్మించిన జిల్లా కేంద్రంలోని పురావస్తు శాఖ భవనాన్ని ఆదివారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి జరిగే కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, పురావస్తు శాఖ రాష్ట్ర అధికారులు పాల్గొంటారని జిల్లా మ్యూజియం ఏడీ రజిత ఓ ప్రకటనలో తెలిపారు.

మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించండి

అనంతపురం టవర్ క్లాక్: ముస్లిం, మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఎం మహబూబ్ బాషా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలను నమ్ముకుని ముస్లిం మైనార్టీలు ప్రాణాలు లెక్కచేయకుండా పార్టీల కోసం ఎంతో కష్టపడ్డారన్నారు. ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏడుగురు ముస్లిం అభ్యర్థులకు టికెట్లు కేటాయించారన్నారు. టీడీపీ పార్టీ మాత్రం ఒక సీటు కేటాయించిందని మండిపడ్డారు. మైనార్టీలకు పెద్దపీట వేస్తామని చంద్రబాబు నాయుడు చెప్పారని, సీట్ల పంపకాల్లో ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.

నేత్రపర్వంగా మల్లేశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో మల్లేశ్వరస్వామి రథోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో హోమం, శిఖర ప్రతిష్టాపన, మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, ధూళోత్సవం సందర్భంగా స్వామివారి ఆభరణాలను రథంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. భక్తులు రథంపై అరటి పండ్లు, తమలపాకులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది మంది భక్తులు రథోత్సవాన్ని తిలకించారు.

సజావుగా సర్టిఫికెట్ల పరిశీలన



కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు క్యూలో నిలబడిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన సజావుగా జరిగింది. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగుల సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశాఖలో మొత్తం 204 మందిని రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందన్నారు. అందులో 135 ఎంపీహెచ్ఏ(ఎం)లో 123, 18 ల్యాబ్ టెక్నీషియన్‌లో 9, 40 మంది ఏఎన్ఎంలో 16, 12 మంది ఫార్మసిస్టుల్లో 9 మందికి జీఓ ఇవ్వడం జరిగిందన్నారు. ఫార్మసిస్టులకు ఆర్‌డీ పరిధిలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ఇక మిగతా వారందరికీ ఆదివారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గిరిజా మనోహర్ రావు, సీనియర్ అసిస్టెంట్ కమలాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతి దూలం లాగుడు పోటీలు

కూడేరు: కూడేరు మండలం మరుట్ల–3వ కాలనీలో శనివారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 20 నిమిషాల వ్యవధిలో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజుల పల్లెకి చెందిన పసుపులేటి రమణ వృషభాలు ప్రథమ విజేతగా నిలిచాయి. అనంతపురానికి చెందిన ఆచారి ఓబుళపతి వృషభాలు ద్వితీయ, గార్లదిన్నెకు చెందిన పరమేష్ వృషభాలు తృతీయ, రాయదుర్గం మండలం గొల్లల దొడ్డికి చెందిన వీరేష్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు సత్యనారాయణ, ఎర్రిస్వామి, పెన్నహోబులేసు, నరసింహులు, మల్లికార్జున, రామాంజనేయులు, ధనుంజయ్య, బాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ శనివారం తెలిపారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లను, కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఈనెల 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలన్నారు. ఆ వివరాలను మార్చి 13న ఈసీ బహిర్గతం చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. అయితే సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన ఎస్‌బీఐ, ఇప్పుడు 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించడం కోర్టు ధిక్కారమే అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఎన్నికల బాండ్ల విధానం వల్ల బీజేపీ అత్యధికంగా లాభపడిందన్నారు. రానున్న ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐ ద్వారా బీజేపీ పన్నాగం పన్నుతోందన్నారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ వైఖరి నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు.

వైరల్



డ్రోన్ దీదీ

హరియాణాకు చెందిన షర్మిల యాదవ్ పెద్ద చదువులు చదువుకోవాలని కల కన్నది. అయితే ఇంటర్మీడియేట్ పూర్తికాగానే 'ఇక చాలు' అన్నారు తల్లిదండ్రులు. పెళ్లి అయిన తరువాత కుటుంబ బాధ్యతల్లో తలమునకలైనప్పటికీ షర్మిలకు చదువుపై ఉన్న ఇష్టం మాత్రం పోలేదు. 'డ్రోన్ సిస్టర్' ప్రోగ్రాంలో భాగంగా మహిళలకు డ్రోన్ పైలట్ ట్రైనింగ్ ఇస్తున్నారని తెలుసుకున్న షర్మిల ట్రైనింగ్ కోర్సులో చేరింది. ఫస్ట్ టెస్ట్‌లో ఫెయిల్ అయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు 'మరో ప్రయత్నం చెయ్యి' అని ప్రోత్సహించారు. సెకండ్ టైమ్ టెస్ట్ పాస్ అయిన షర్మిల ఇప్పుడు సర్టిఫైడ్ డ్రోన్ పైలట్‌గా గుర్తింపు పొందింది. ఎలాంటి టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా మాస్టరింగ్ కంట్రోల్స్, హైట్ అండ్ స్పీడ్ రీడింగ్, స్మూత్ టేక్-ఆఫ్, ల్యాండింగ్స్...మొదలైన సాంకేతిక విషయాలపై అవగాహన ఏర్పర్చుకుంది. ఇప్పుడు ఆమెను అందరూ 'డ్రోన్ దీదీ' అని పిలుస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించిన పనుల్లో డ్రోన్ పైలట్‌గా చేతి నిండా పనితో మంచి ఆదాయన్ని అర్జిస్తోంది. వ్యవసాయ భూముల్లో షర్మిల యాదవ్ డ్రోన్ ఆపరేట్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఈ కార్యక్రమాన్ని మీకు సమర్పిస్తున్నవారు...

యూట్యూబ్ 'సిల్వర్ ప్లే బటన్'ను సొంతం చేసుకోవడం అనేది అంత వీజీ కాదు. లక్ష మంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్న కంటెంట్ క్రియేటర్‌లకు యూట్యూబ్ ప్రతిష్ఠాత్మకమైన సిల్వర్ ప్లే బటన్ సొంతం అవుతుంది. అయితే పాకిస్థాన్‌లోని గిల్గిత్-బల్టిస్థాన్ ప్రాంతంలోని ఖప్లూ నగరానికి చెందిన మహ్మద్ సిరాజ్ అనే పిల్లాడు మాత్రం తన యూట్యూబ్ చానల్ 'సిరాజీ విలేజ్ వ్లోగ్స్'తో 'సిల్వర్ ప్లే బటన్'ను అవలీలగా సాధించాడు. సిరాజ్ చానల్‌కు లక్షమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. చెల్లి ముస్కాన్ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి సిరాజ్ చేసిన వీడియోలు పాపులర్ అయ్యాయి. యూట్యూబ్ సిల్వర్ ప్లే బటన్‌ను సిరాజ్ అన్‌బాక్సింగ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయింది.



అమ్మా, నాన్న ఆనంద విహారం



ఇన్‌స్టాగ్రామ్ యూజర్ వివేక్ వాఘ్ సర్‌ప్రైజ్ ట్రావెల్ ప్లాన్‌తో తల్లిదండ్రులను ఆశ్చర్యానందాలకు గురి చేశాడు. 'ఫ్లైయిట్‌లో మనం జైపూర్‌కు వెళుతున్నాం' అని చెప్పి తల్లిదండ్రులను ఎయిర్‌పోర్ట్‌కు తీసుకెళ్లాడు. పాస్‌పోర్ట్‌లను వారి చేతికి అందిస్తూ ఆఖరులో అసలు విషయం చెప్పాడు. తాము వెళుతున్నది జైపూర్ కాదని సింగపూర్‌కు అని తెలుసుకున్న వివేక్ తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు. ఇది వారికి తొలి అంతర్జాతీయ ప్రయాణం. 'సీ దెయిర్ రియాక్షన్... సర్‌ప్రైజ్ ట్రిప్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో మూడు లక్షలకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

సోషల్ మీడియా యూజర్‌లు, సెలబ్రిటీలు ఈ వీడియోను చూసి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. యాక్టర్ జై భానుశాలి 'బ్రాడ్ సస్. విషయం తెలిసిన తరువాత మీ తండ్రి ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ నాకు ఎంతగానో నచ్చింది. మా అబ్బాయి మమ్మల్ని సింగపూర్ తీసుకువెళ్లాడు అని ఆయన గర్వంగా స్నేహితులతో చెప్పుకోవచ్చు' అని కామెంట్ పెట్టారు.

ఏ డే ఇన్ మై లైఫ్...



గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సలోని రకహోలియా 'ఏ డే ఇన్ మై లైఫ్ ఎట్ గూగుల్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియో 2.4 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరడం నుంచి గూగుల్ ఆఫీసులోకి అడుగు పెట్టడం, చెక్ అప్‌డేట్స్, బ్రేక్ ఫాస్ట్, ప్లాన్ ఫర్ ది డే అండ్ వర్క్, గెట్ సమ్ వాటర్ అండ్ స్నాక్స్, కోడ్ అండ్ అటెండింగ్ మీటింగ్స్, కొద్ది సమయం పుస్తకం చదవడం, టేబుల్ టెన్నిస్ ఆడడం, వర్క్ చేస్తూ స్నాక్స్, కాఫీ ఆస్వాదించడం. వర్క్‌కోడ్, డిజైన్, డిస్కస్, మ్యూజిక్ రూమ్‌లో కొద్దిసేపు గడపడం, జిమ్‌లో కొద్దిసేపు ఎక్సర్‌సైజ్, కోడింగ్ సెషన్‌లు, సాయంత్రం ఆఫీసు నుంచి తిరిగి ఇంటికి వెళ్లడం...ఇలాంటి దృశ్యాలెన్నో ఈ వీడియోలో కనిపిస్తాయి. ఆఫీస్ జిమ్‌లో క్విక్ వర్కవుట్ సెషన్‌లాంటి వెల్-టైమ్‌డ్ బ్రేక్స్‌ను ఈ వీడియో హైలెట్ చేస్తుంది.

ఇచట డిజిటల్ ఆమ్లెట్ డిజిటల్ పరోటా వేయబడును

అమ్లెట్లు ఎచట వేసెదరు? ఆలూ పరాట ఎక్కడ తయారుచేసెదరు?' అనే ప్రశ్నలకు 'ఇవి కూడా ప్రశ్నలేనా. స్టవ్ మీద ఉన్న పెనంపై వేస్తారు. చేస్తారు' అంటాం. అయితే ఒక టెక్ కంటెంట్ క్రియేటర్ మాత్రం మనం చెప్పే జవాబును మార్చే ప్రయత్నంలో ఉన్నాడు. సదరు ఈ క్రియేటర్ కంప్యూటర్ 'సిపియు'పై ఆమ్లెట్ వేశాడు. ఆ తరువాత మినీ పరోటా తయారుచేశాడు. వైరల్ అవుతున్న ఈ వీడియోను చూసి 'డిజిటల్ ఆమ్లెట్లు-పరోటాలు వచ్చేశాయి' అని మురిసిపోతున్నారు ప్రేక్షకమహాశయులు.



ఆహా...పోహ



ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది బ్లాగర్స్ మన దేశానికి వచ్చి స్థానికులతో హాయిగా కలిసిపోతారు. ఆ జ్ఞాపకాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. తాజాగా మన దేశానికి వచ్చిన రష్యన్ బ్లాగర్ చుగురోవా వీడియో వైరల్ అయింది. మహారాష్ట్రలోని చిన్నపాటి హోటల్‌కి వెళ్లిన చుగురోవా అక్కడ ఉన్న సూర్యవన్షి అనే మహిళను 'నమస్తే దీదీ' పలకరించి 'ఏం చేస్తున్నారు?' అని అడిగింది. 'పోహ' (అటుకుల ఉప్మా) అని చెప్పింది సూర్యవన్షి.

'నాకు కూడా నేర్పించరా?' అని చుగురోవా అడగగానే ఓకే చెప్పింది సూర్య. సూర్య డైరెక్షన్‌లో టమాటాలు, ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి...మొదలైనవి తరగడం నుంచి పెనంలో వేడి నూనెలో వేయడం వరకు ఎన్నో చేసి 'పోహ' ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసింది చుగురోవా. ఆ తరువాత 'పోహ తినండి....వోన్లీ ఇరవై రూపాయలు మాత్రమే' అని హిందీలో అరిచింది. 'నమస్తే దోస్తో' కాప్షన్స్‌తో 'మేకింగ్ పోహ' వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది చుగురోవా.

మై ఛాయిస్!

భారతీయ మహిళలకు కుర్తాలు ఇష్టమైన దుస్తులు. వృత్తిరీత్యా టీషర్ట్‌లు ధరించడం అందరికీ సౌకర్యం కాకపోవచ్చు. అందుకే 'విమెన్స్ డే' సందర్భంగా జొమాటో తన మహిళా డెలివరీ పార్ట్‌నర్లకు ఎర్ర కుర్తాలను బహూకరించింది. ఇకపై వారు డ్యూటీలో నచ్చిన టీ షర్ట్‌గాని, కుర్తా గాని ధరించవచ్చు. ఈ సందర్భంగా చేసిన ప్రమోషన్ యాడ్ ఇంటర్‌నెట్‌లో కుతూహలం రేపుతోంది.

జొమాటోలో దేశమంతా మూడున్నర లక్షల మంది డెలివరీ పార్ట్‌నర్లు ఉన్నారు. అంటే ఫుడ్ డెలివరీ చేసే బోయ్‌లు. వీరిలో స్త్రీలు కేవలం 1500 నుంచి 2000 మంది మాత్రమే ఉన్నారు. టూ వీలర్ మీద వేళకాని వేళలో తిరగాల్సి రావడం వల్ల ఇదొక ఛాలెంజింగ్ జాబ్ అయ్యింది మహిళలకు. అయినప్పటికీ సవాలుగా తీసుకుని వందల ఆర్డర్లు డెలివరీ చేస్తున్న జొమాటో మహిళలు ఉన్నారు. వృత్తిరీత్యా వారు టీషర్ట్ ధరించాల్సి ఉంటుంది. అది అందరికీ సౌకర్యం కాకపోవచ్చు. అందుకే జొమాటో మొన్నటి విమెన్స్ డే రోజు కుర్తాలు బహూకరించింది. 'మీ చాయిస్. మీరు టీషర్ట్ వేసుకోవచ్చు లేదంటే కుర్తాలు వేసుకోవచ్చు' అని చెప్పింది. ఇందుకోసం ప్రమోషన్ యాడ్ చేస్తే మహిళా డెలివరీ పార్ట్‌నర్‌లు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'జేబులున్న కుర్తా నాకు నచ్చింది' అని ఒక మహిళ చెప్పింది. 'ఫోటోలు బాగా తీయండి' అని మరో మహిళ ఉత్సాహపడింది. 'పదండి అందరం మనాలి వెళ్దాం' అని మరో మహిళ ఉత్సాహ పరిచింది. కొత్త ఉపాధి మార్గంలో వెరవక నడిచే వీరందరినీ చూసి నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. దేశీయ దుస్తుల్లో బాగున్నారంటూ కితాబిచ్చారు.



హెల్త్

ఈ నెల 14న
వరల్డ్ కిడ్నీ డే



రకరకాల కిడ్నీ సమస్యలూ... పరిష్కారాలు!



ఇది వేసవి. డీ-హైడ్రేషన్‌కు గురయ్యే కాలం. సాధారణంగా మూత్రపిండాల్లో (కిడ్నీల్లో) రాళ్లు వేసవిలో తరచూ బయటపడుతుంటాయి కాబట్టి ఈ సమస్యకు వేసవిని ఓ సీజన్‌గా పరిగణిస్తుంటారు. పైగా ఈనెల 14వ తేదీ 'వరల్డ్ కిడ్నీ డే' సందర్భంగా మూత్రపిండాల్లో రాళ్లలాంటి సాధారణ సమస్యలు మొదలుకొని, సీకేడీ వంటి మూత్రపిండాలకు సంబంధించిన అనేక సమస్యలూ, వాటి పరిష్కారాలపై అవగాహన కోసమే ఈ కథనాలు.

కిడ్నీలలో రాళ్లు...

కిడ్నీలో రాళ్ల ఎంత సాధారణ సమస్య అంటే ఒకరి 70 ఏళ్ల జీవిత కాలంలో 20% మంది పురుషుల్లో, 10% మంది మహిళల్లో ఏదో ఒక దశలో అవి కనిపిస్తాయి. అయితే రాళ్ల రావడమన్నది పురుషుల్లో ఎక్కువ. వాటి వల్ల కిడ్నీ దెబ్బతిని, కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీసి, జీవితాంతం దయాలసిస్ మీద ఉండాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది. అందుకే వాటి గురించి తెలుసుకుని, కిడ్నీలో రాళ్లు ఏర్పడేందుకు అవకాశమున్నవారు జాగ్రత్త వహించాల్సిన అవసరముంది.

రాళ్లూ... రకాలు...

మన ఆహారంలో, తాగే పానీయాల్లో క్యాల్షియమ్ వంటి అనేక ఖనిజాలూ, లవణాలు ఉంటాయి. జీవక్రియలు జరిగే సమయంలో ఆగ్జలేట్స్, యూరిక్ యాసిడ్, సిస్టయిన్ వంటి స్ఫటికాలు ఏర్పడవచ్చు. అలాగే ఇంకొందరిలో రాళ్లు రూపొందే ప్రక్రియను అరికట్టే సిట్రేట్‌లు తక్కువగా ఉండవచ్చు. అలాంటివారితో పాటు... నీళ్ల తక్కువగా తాగే వారిలో లవణాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమై క్రమంగా గట్టిబడి రాయిలా మారేందుకు అవకాశాలు ఎక్కువ. దేహంలోని వడపోత ప్రక్రియ అంతా కిడ్నీలో జరుగుతుంది కాబట్టి ఇక్కడ రాళ్లు ఏర్పడే అవకాశాలెక్కువ.



కిడ్నీరాళ్లలో ప్రధానమైనవి కాల్షియమ్ ఆగ్జలేట్స్ (70 – 80%). మిగతావి క్యాల్షియమ్ ఫాస్ఫేట్, యూరిక్ యాసిడ్, సిస్టైయిన్స్ వంటివి. ఇక ట్రిపుల్ ఫాస్ఫేట్‌గా పేరున్న మెగ్నీషియమ్, అమోనియమ్ ఫాస్ఫేట్‌లతో తయారయ్యే స్ట్రువైట్ అనే రాళ్లు చాలా అరుదుగా, పెద్దగా ఏర్పడతాయి. దాంతో స్ట్రువైట్ రాళ్లతో కిడ్నీ ఫెయిల్యూర్‌కు అవకాశాలు ఎక్కువ. అంతేకాదు... కొన్నిసార్లు యూరిన్ ఇన్ఫెక్షన్ బాధితుల్లో 'ప్రోటియస్ వల్గారిస్' అనే బ్యాక్టీరియా కారణంగా కూడా స్ట్రువైట్ రాళ్లు ఏర్పడి, మరింత సంక్లిష్టతలకూ, ప్రమాదాలకూ దారితీసే అవకాశముంది.

ఎవరిలో ఎక్కువ...?

◆ నీళ్లు చాలా తక్కువగా తాగేవాళ్లలో ◆ ఉప్పు ఎక్కువగా తీసుకునేవారిలో ◆ మాంసాహారాలూ, చక్కెరలు ఎక్కువగా తినేవారిలో ◆ ఉబకాయం ఉన్నవారిలో ◆ డయాబెటిస్, పేగు వ్యాధులు లాంటి సమస్యలు ఉన్నవారిలో ◆ క్రోన్స్ డిసీజ్, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్, యూరిక్ యాసిడ్ మోతాదులు ఎక్కువగా పెరిగే గౌట్, పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్, రీనల్ ట్యుబ్యులార్ అసిడోసిస్, హైపర్‌పారాథైరాయిడిజమ్ వంటి సమస్యలున్న వారిలో ◆ సిప్రోఫ్లాక్సిన్ వంటి కొన్ని యాంటీబయాటిక్స్, సల్ఫా డ్రగ్స్, హెచ్ఐవీ మందులు వాడే వాళ్లతో పాటు, బరువు తగ్గడానికి బేరియాట్రిక్ సర్జరీ (అందులోనూ రూక్స్-ఎన్-వై గ్యాస్ట్రిక్ బైపాస్) చేయించుకున్నవారిలో.

లక్షణాలు...

నడుము లేదా వీపువైపు ఉరఃపంజరం కింది భాగంలో భరించలేనంత తీవ్రమైన నొప్పి. ఒక్కోసారి ఈ నొప్పి పక్కలకూ, కిందివైపునకూ, పొట్టవైపునకూ, కొందరు పురుషుల్లో వృషణాల సంచివైపునకూ పాకుతుంది. ఇది అలలు అలలుగా వస్తూ పోతూ ఉంటుంది. నొప్పితో పాటు... ◆ వికారం లేదా వాంతులు ◆ జ్వరం ◆ మూత్రంలో రక్తం కనిపించడం ◆ మూత్రవిసర్జనలో మంట ◆ కొందరిలో రాయి కారణంగా మూత్రం వస్తున్న ఫీలింగ్ ఉన్నప్పటికీ, రాయి అడ్డుపడుతుండటం వల్ల మూత్ర విసర్జన జరగకపోవచ్చు. ఇలాంటి వాళ్లలో మూత్రం ఆగి, ఆగి చుక్కలు చుక్కలుగా పడుతుండవచ్చు.

అరుదుగా కొందరిలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ మరేదో సమస్యతో డాక్టర్ దగ్గరికి వచ్చి, పరీక్షలు చేయించినప్పుడు చాలా పెద్దరాయి కారణంగా అప్పటికే కిడ్నీ చాలావరకు చెడిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

నిర్ధారణ...

మూత్రపిండాలు, యురేటర్, బ్లాడర్‌ల సీటీ స్కాన్, ఎక్స్-రే, అవసరాన్ని బట్టి అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి పరీక్షలతో కిడ్నీలో రాళ్లను కనుగొంటారు. కొన్నిసార్లు మూత్రపరీక్ష, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష అవసరం కావచ్చు.

చికిత్స...

◆ రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగమని బాధితులకు సూచిస్తుంటారు. దాంతో రాయి రూపొందడానికి వీల్లేకుండా లవణాలు ఎప్పటికప్పుడు మూత్రంలో కొట్టుకుపోవడంతో పాటు... కొన్నిసార్లు రాయి దానంతట అదే బయట పడేందుకు అవకాశముంటుంది.

◆ ఉప్పు, మాంసాహారం తగ్గించమని సూచిస్తుంటారు. అలాగే కొందరిలో రాయి ఏర్పడటానికి దోహదం చేసే పాలకూర, టమాటాకు దూరంగా ఉండమని సూచిస్తారు. ఇది కేవలం కిడ్నీలో రాయి ఏర్పడేందుకు అవకాశమున్నవారికి మాత్రమే. మిగతా ఆరోగ్యవంతులు వీటిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

ఇక శస్త్రచికిత్సల విషయానికి వస్తే...

◆ **యురేటరోస్కోపిక్ రిమూవల్ :** ఎండోస్కోప్ సహాయంతో బ్లాడర్‌లోకీ, కిడ్నీ నుంచి బ్లాడర్ వరకు ఉండే నాళాలైన యురేటర్లలోంచి ఈ ప్రక్రియ ద్వారా రాళ్లు తొలగిస్తారు.

◆ **ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ :** రాళ్లు పెద్దవిగా ఉంటే ఈ షాక్ వేవ్స్ సహాయంతో వాటిని చిన్న చిన్న ముక్కలుగా /పౌడర్‌గా పొడిపొడి చేస్తారు. దాంతో రాళ్ల పౌడర్ మూత్రంలో వెళ్లిపోతుంది.

◆ **పర్‌క్యుటేనియస్ నెఫ్రోలిథోటమీ (పీసీఎన్ఎల్)** : ఈ ప్రక్రియలో నడుం పక్క భాగం నుంచి కిడ్నీలోకి ఒక పైప్‌ను రాయి ఉన్నచోటికి పంపి, ఆ పైప్ ద్వారా రాయిని బయటకు తీసుకొస్తారు.



డాక్టర్ కిరణ్ కుమార్ ముక్కు,
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్.

క్రానిక్ కిడ్నీ డిసీజ్ -సీకేడీ

క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)కి మొదటి కారణం మధుమేహం, రెండోది దీర్ఘకాలిక రక్తపోటు. మూడో కారణం గ్లోమరులార్ డిసీజ్. ఈ సమస్య ఉన్నవారిలో మూత్రంలో ప్రోటీన్ ఎక్కువగా పోతుంటుంది. ఫలితంగా కాళ్లవాపు, ముఖం వాచినట్లుగా ఉండటం, మూత్రం నురగలా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో కారణాలేమీ లేకుండానే కిడ్నీలు దెబ్బతినవచ్చు. కిడ్నీలోని మూత్రనాళాలను దెబ్బతీసే ఇంటస్టిషియల్ వ్యాధులు, కొన్ని జన్యుపరమైన జబ్బులు, ఇన్ఫెక్షన్లు, కొన్నిసార్లు కిడ్నీలో రాళ్లు కూడా క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)కి కారణం. అయితే ఈ కారణాలన్నింటిలోనూ డయాబెటిస్, హైబీపీ వల్లనే 70- 80 శాతం కిడ్నీవ్యాధికి దారితీస్తాయి.

ఎవరెవరిలో... ఎందువల్ల : చిన్నపిల్లల్లో సీకేడీ ఉందంటే అది జన్యుపరమైన జబ్బుల వల్ల వచ్చిందేమోనని చూడాలి. మధ్యవయసు వారిలోనైతే... ఇందుకు అదుపులో లేని డయాబెటిస్, అధిక రక్తపోటు కారణమని అనుమానించాలి.

లక్షణాలు : వికారం / ఆగకుండా వాంతులు ◆ ఎప్పుడూ నీరసంగా ఉండటం,

◆ కాళ్లవాపులు, ◆ ముఖం వాపు, ◆ ఆకలి తగ్గడం ◆ ఊపిరి అందకపోవడం / ఆయాసం ◆ రాత్రివేళ మూత్రం కోసం ఎక్కువగా నిద్రలేవాల్సి రావడం, మూత్రం చుక్కలు చుక్కలుగా తక్కువగా రావడం, ◆ మూత్రంలో రక్తస్రావం... వంటి లక్షణాలు ఉంటాయి. ఇవన్నీ కిడ్నీలు 50 శాతం దెబ్బతిన్న తర్వాతే బయటపడవచ్చు.

చికిత్స : క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోగలిగినప్పుడు కిడ్నీ బాధితులు ఓ సాధారణ వ్యక్తి జీవించినంత కాలం జీవించవచ్చు. డయాలసిస్‌లో రెండు రకాలు. మొదటిది హీమో డయాలసిస్; రెండోది పెరిటోనియల్ డయాలసిస్.

హీమో డయాలసిస్ : ఇది యంత్రం ద్వారా రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ. వారానికి మూడు సార్లు రోజు విడిచి రోజు డయాలసిస్ కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలి. ఈ ప్రక్రియకు నాలుగు గంటలు పడుతుంది.

పెరిటోనియల్ డయాలసిస్: ఇది ఇంట్లోనే చేసుకునే డయాలసిస్. దీన్నే 'కంటిన్యువస్ అంబులేటరీ పెరిటోనియల్ డయాలసిస్' (సీఏపీడీ) అని కూడా అంటారు.

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స : కిడ్నీ తొంభై శాతం పాడైనప్పుడు మాత్రమే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను చివరి ఆప్షన్‌గా డాక్టర్లు సూచిస్తారు.



డయాలసిస్ ప్రతీకాత్మక చిత్రం

కిడ్నీలను పదిలంగా కాపాడుకోవాలంటే...



◆ డయాబెటిస్, హైబీపీ ఉన్నవారు కచ్చితంగా వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. మధుమేహం ఉన్నవారు మూడు నెలలకోసారి హెచ్‌బీఏ1సీ పరీక్షను చేయిస్తూ... రీడింగ్స్ 6.5 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. హైబీపీ ఉన్నవారు తమ బీపీని 130/80 ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ◆ రక్తంలో కొవ్వులు, కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు కొవ్వులు ఎక్కువగా ఉండే మాంసాహారం తక్కువగా తీసుకుంటూ... శాకాహారం, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ◆ మన ఆహారంలో ఉప్పును చాలా తక్కువగా తీసుకోవాలి. ఉప్పు ఎక్కువ మోతాదులో ఉండే బేకరీ ఐటమ్స్, పచ్చళ్లు, అప్పడాలు, నిల్వ ఆహారాలకు దూరంగా ఉండాలి. ◆ ఆగ్జలేట్స్ ఎక్కువగా ఉండే గింజ ధాన్యాలు, సోయా బీన్స్, చాక్లెట్ల వంటి వాటిని తగ్గించాలి. ◆ క్యాల్షియం సప్లిమెంట్లను కూడా తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలి. అలాగే క్యాల్షియం సిట్రేట్‌కు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నివారించే లక్షణం ఉంది. నిమ్మజాతి పండ్లు, ఆరెంజ్ జ్యూస్ వంటివాటివి డాక్టర్ల సూచనల మేరకు తీసుకోవాలి. ◆ అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గించుకోవాలి. ◆ పొగతాగడం పూర్తిగా మానేయాలి. ◆ ఆల్కహాల్ వల్ల ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దాంతో దేహంలో నీళ్లు తగ్గి డీహైడ్రేషన్‌కు గురవుతాయి. ఇవి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడదానికి అవకాశమిస్తుంది. కాబట్టి ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. కూల్‌డ్రింక్స్‌కూ దూరంగా ఉండటం మంచిది. ◆ ఏవైనా మందులు లేదా విష పదార్థాలు ఒంట్లోకి రాగానే వాటిని విరిచేసి, వడపోసి బయటకు పంపే బాధ్యతలు కాలేయం, కిడ్నీలవే. నొప్పి నివారణ మందుల వంటి కొన్ని ఔషధాలు దీర్ఘకాలంలో కిడ్నీలను దెబ్బతీసే అవకాశం ఉన్నందున డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా ఏ రకమైన 'ఓవర్ ద కౌంటర్ డ్రగ్స్' వాడకూడదు. ◆ మూత్రం ఇన్ఫెక్షన్స్‌ని సరైన పద్ధతిలో, సరైన మందులతో, సరైన సమయంలో వైద్యం చేయించుకుని, పూర్తిగా తగ్గేలా చూసుకోవాలి.

